# అంతేటి నీవేనమ్మా!

ఆదూరి వెంకటసీతారామమూర్తి

**ఉదయం** ఎనిమిది —

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ముందున్న క్యూ గూడ్సు బండిలా ఉంది.

కౌంటర్ లోని కన్నారావు నైట్ డ్యూటీ చేసి ఆరు గంటల లేటుతో బండి నడుపుతున్న మెయిల్ డ్రైవర్‌లా చిటపటలాడిపోతున్నాడు.

రైలు తప్పిపోతుందేమో అన్నంత ఆత్రతగా సైకిల్ తొక్కుకుని వచ్చిన సూర్యం సైకిల్ దిగొచ్చి అదరా బాదరాగా కౌంటర్ వైపు నడిచాడు.

"ఏమండోయ్! ఆగండాగండి!"

క్యూలోని జనం ఏక కంఠంతో అరిచేరు.

సూర్యం ఆగేడు.

ఆగి ఏమి టన్నట్టు చూసేడు.

"ఎందుకీ క్యూ? తగలడనా?" ఎక్కణ్ణుంచో వినిపించింది.

సూర్యాని కేదో జోక్ గుర్తు కొచ్చి భోళ్ళున నవ్వబోయి తమాయించు కున్నాడు.

"అయ్యా! నేను టికెట్లేం కొనను. జస్ట్ ఇన్‌ఫర్‌మేషన్ కోసం ..." అన్నాడు వినయంగానే.

"ఎంక్వయిరీ కౌంటర్ ఏడిసిందిగా?"

ఇందాకటి గొంతే మళ్ళీ వినిపించింది.

సూర్యం ఈసారి నవ్వేడు. నవ్వడం అయ్యేక "మీరే చూడండి" అని ఎదురుగా ఉన్న ఆ కౌంటర్ని చూపించేడు.

అక్కడ ఫోన్లు మ్రోగుతున్నాయి. మానవ మాత్రు డెవడూ అక్కడ కనిపించడం లేదు.

"ఎంతైనా ప్రభుత్వోద్యోగులుగా! దేశం మనది, ప్రభుత్వం మనది. కాబట్టి వాళ్ళూ మనవాళ్ళే. మన అన్నలూ, తమ్ములూ" అన్నా రెవరో.

కొందరు దేశాన్నీ, మరికొందరు మంత్రుల్నీ తిట్టిపోసేరు.

కౌంటర్లో మనుషులు లేకపోవడానికీ, దేశ రాజకీయాలకీ సంబంధ మేమిటో సూర్యాని కర్థం కాలేదు.

కౌంటర్ దగ్గరకు నెమ్మదిగా నడిచి, "మాస్టారూ, ఎల్లుండి గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి హైదరాబాద్ నాలుగు బెర్తు లుంటాయా?" అని అడిగేడు.

"లేవు" అన్నాడు కౌంటర్‌లోని కన్నారావు విసుగ్గా.

"పోనీ, వెయిటింగ్ లిస్టులో నంబరెంతుందో చెబుతారా?"

ఆ ప్రశ్నకి కన్నారావు వెంటనే జవాబు చెప్పలేదు.

ఇంకెవరితోనో దెబ్బలాడుతున్నాడు మిగిలిన చిల్లర అడిగేడని.

కౌంటర్ కన్నంలోంచి కన్నారావు ముఖం చూడాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు సూర్యం. అయినా అదే ప్రశ్నను మళ్ళీ రెట్టించేడు పట్టు వదలని విక్రమార్కుడిలా.

అతని పట్టుదలకు కన్నారావుకి కోప మొచ్చింది.

"మీరు లైన్లో రండి. చెబుతాను" అన్నాడు.

లైను వంక చూశాడు సూర్యం.

చివరి మనిషి కనిపించడం లేదు.

"పోనీ, ఆర ఏమైనా ఉంటుం దంటారా?" అడిగేడు మళ్ళీ.

కన్నారావుకి జాలేసిన ట్లుంది—

"ఏం చెప్పగలమండీ? కోటా నాలుగు రోజుల క్రితమే అయిపోయింది. అసలే పెళ్ళిళ్ళ సీజను. మరో నాలుగు రోజుల వరకూ కూడా లేవు" అన్నాడు.

"సీట్లు కూడా లేవాండీ?"

"లేవు, సార్. ఆ రోజు కండక్టర్‌ని అడగాల్సిందే" అని మరో మాటకు తావియ్యకుండా తన పనిలో పడ్డాడు.

సూర్యం కౌంటర్ నుంచి ఇవతలి కొచ్చి నిలబడ్డాడు. అతని మనసంతా ఆందోళనగా ఉంది. ఏం చేయడానికీ పాలుపోని పరిస్థితి!

'పొద్దున్నే ఇలాంటి కేసు ఒక్కటి దొరికితే చాలు.' కన్నారావు గొణుక్కోడం వినిపించిం దతనికి.

'సదా మీ సేవలో' అనే రైల్వేవారి బోర్డుకూడా అతని కంటికి కనిపించింది.

అక్కయ్యకు నుస్తీ చేసిందనీ, సాధ్యమైనంత తొందరలో రావలసిందనీ హైదరాబాద్ నించి బావ టెలిగ్రామ్ ఇవ్వడంతో తల్లినీ, తండ్రినీ, చెల్లెల్నీ తీసుకుని బయల్దేరడానికి నిశ్చయించుకున్నాడు. రైల్వే వారి సదుపాయాలు తెలుసు కాబట్టి రిజర్వేషను లేనిదే పెద్ద వయసులో ఉన్న తల్లితండ్రులను తీసుకెళ్ళడం అసాధ్యమనుకున్నాడు. ఏం చేయడమా అని తల గోక్కున్నాడు. ఆ రోజు కా రోజు సీట్లయినా దొరుకుతాయన్న గ్యారంటీ లేదు.

అయితే ఒక మార్గముంది. రైల్వే పోర్టర్‌కి నాలుగో, అయిదో ఇస్తే రైలు బయల్దేరేది ఇక్కడ్నుంచే కాబట్టి తువ్వాళ్ళేసి రిజర్వు చేసిన సీట్లు దొరుకుతాయి ఎంత రద్దీగా ఉన్న రోజునైనా—

కానీ అలా ప్రయాణం చేయడం సూర్యానికి ఇష్టంలేదు. బలహీనుణ్ణి బలవంతుడు దోచుకున్నట్లు దబాయింపుగా లేని హక్కుతో సీట్లు సొంతంచేసుకుని అమ్ముకునే పోర్టర్లంటే అతని కసహ్యం. కానీ ఏ దారీ లేని వాళ్ళకు అదే దారి మరి!

"బెర్తులు కావాలేంటి, బాబూ?"

చెవిలో ఎవరో మాట్లాడినట్లయి తల తిప్పి చూశాడు.

రైల్వే మార్కు నీలంచొక్కా— మోకాళ్ళ వరకూ ఎగగట్టిన తెల్లపంచ— తెల్లటి బొద్దు మీసాలు ... నల్లగా, పొట్టిగా ఉన్నా డతను.

అతని పేరు సింహాచలమని సూర్యానికి తెలీదు. తన క్కావలసింది అతని కెలా తెలిసిందోనని ఆశ్చర్యపోయాడు. 'తనకు తెలియని ఇదో కొత్త పద్ధతి కూడా ఉందన్న మాట' అనుకున్నాడు.

"కావాలి. గోదావరికి— నాలుగు" అన్నాడు తడబడుతూ ... వరాలిచ్చే వేల్పు ముందు భక్తుడిలా.

సింహాచలం సింహాద్రప్పడి పోజు కొట్టేడు. కాస్సేపు మౌనం చూపెట్టేడు.

"ఏం? తెప్పించ గలవా? హైదరాబాద్‌కి" అన్నాడు సూర్యమే, ఆ నిశ్శబ్ద సమయాన్ని భరించలేక. బుర్రలో ఆలోచనలు రైలుబళ్ళలా పరుగులు తీస్తున్నాయి.

"టిక్కెట్టు ధర కాక పదిహేను అవుతుంది. కావలిస్తే చెప్పండి" అని నిప్పుకోసం వచ్చిన వాడిలా బీడీ ముక్క అంటించుకుని ఎటో చూస్తూ నిలబడ్డాడు.

కాస్సేపు సందిగ్ధంలో పడి "ఎల్లుండికి కావాలి. తేగలవా?" అనగానే తేగలనన్నట్టు ధీమాగా తలూపేడు సింహాచలం.

పాల డబ్బాలు బ్లాకు ... పాళ్యపుస్తకాలు బ్లాకు...స్కూటర్లు బ్లాకు...సినిమా టిక్కెట్లు బ్లాకు — చివరకు రైల్వే టిక్కెట్లుకూడా...

"పది రూపాయల చొప్పున ఇస్తాను. నాలుగు బెర్తులు కావాలి. ఆ పైన నీ ఇష్టం."

"రూపాయి కూడా తగ్గదు. అయిదే ఉన్నాయి ఆ రోజుకి. మీకు కావలిస్తే చెప్పండి. లేకపోతే కొనేవాళ్ళకి లోట్లేదు" అంటూ నెమ్మదిగా కేఫ్టేరియా వైపు నడిచేడు సింహాచలం.

సూర్యం మరొక్కసారి ఆలోచించాడు. ఇటువంటి వారిని ప్రోత్సహించకూడదనుకున్న పాలసీ మంచిదే కానీ, ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేదు. తనొక్కడూ అయితే ఎలాగోలాగ ప్రయాణం చేసెయ్యగలడు. కానీ ...

నాలుగంగల్లో సింహాచలం వైపు పరుగెత్తి—"సరే, తీసుకురా" అన్నాడు.

డబ్బివ్వమన్నట్టు నెమ్మదిగా చేత్తో సొంజ్ఞ చేశాడు సింహాచలం.

నోట్లు లెక్కపెట్టి అతడి చేతి కందించాడు సూర్యం.

"ఇక్కడే ఉండండి నే వచ్చేవరకూ" అని బుకింగ్ దాటి వెనక ఉన్న ద్వారం గుండా లోపలికి వెళ్ళిపోయాడు.

అయిదు...పది నిమిషాలు గడిచాయి. సింహాచలం రాకపోయేసరికి సూర్యం ఆలోచనలు పరిపరి విధాలా పోయాయి. 'వెధవది—ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మడానికి లేదు. వీ డా డబ్బు పట్టుకుని ఉడాయించినా దిక్కులేదు' అనుకుంటూ కంగారుగా అటువైపు కదిలాడు. రెండు అడుగులు వేశాడో లేదో ఎదురుగా సింహాచలం!

"రండి" అని హిగిన్‌బాథమ్స్ దాటి కాస్తదూరం నడిచేక నాలుగుటిక్కెట్లూ, నాలుగు రిజర్వేషన్ టిక్కెట్లూ అందించాడు సింహాచలం.

సూర్యం ముఖం వికసించింది.

• • • • • •

మధ్యాహ్నం పన్నెండు.

రిజర్వేషన్ కౌంటర్ మూసేసి ఇవతలి కొచ్చాడు కన్నారావు. అతని కళ్ళు సింహాచలాన్ని వెదికి పట్టుకున్నాయి.

ఇద్దరూ స్టేషన్ పరిసరాలు దాటి నాలుగు రోడ్ల కూడలిలో గల కిళ్ళీ కొట్టు దగ్గిర కొచ్చేరు.

జేబులోంచి పర్సు తీసి సిగరెట్లు కొన్నాడు కన్నారావు.

ఆ రోజు అమ్మిన ఆరు టిక్కెట్ల సొమ్ములోంచి ఆరు రూపాయలు మినహాయించుకుని మిగిలింది కన్నారావు చేతి కందించాడు సింహాచలం.

సిగరెట్లు వెలిగాయి.

• • •

చాలా కథల్లో వర్ణించినట్టుగానే పెళ్ళివారిల్లులా కలకల లాడిపోతూంది రైల్వేస్టేషను. ముస్తాబై అత్తవారింటి కెళ్ళే కొత్త పెళ్ళి కూతు రిలా గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్ ఫారం మీద ఉంది. సమయానికి డబ్బు అందని ఆడపిల్ల




తండ్రిలా కన్నారావు ప్లాట్‌ఫారం మీద తిరుగుతున్నాడు.

నల్ల కోట్లేసుకున్న టి.సి.ల తోనూ, తెల్ల కోట్లేసుకున్న గార్డుల తోనూ మాట్లాడ్డమైపోయింది.

'లాభం లేదు. పరువు పోతూంది' అనుకున్నాడు.

భార్య మీద, మామగారి మీద చెప్పలేనంత కోప మొచ్చింది కన్నారావుకి.

ఉత్తరం ముక్కయినా రాయకుండా కాశీ నుంచి సరాసరి ఉదయమే రైల్లో దిగొచ్చారు అత్తగారూ, మామగారూ— మరో ఇద్దరు ముసలి స్నేహితులతో సహా.

నలుగుర్నీ తీసుకెళ్ళి గోదాట్లో కలిపేయాలన్నంత కోప మొచ్చింది కన్నారావుకి.

"చూసి పోదామని దిగాం. సాయంత్రం గోదావరిలో వెళ్ళిపోతాం" అన్నారు మామగారు. బతిమాలడాలూ, ఆశ పెట్టడాలూ అన్నీ అయ్యాయి. అవన్నీ కన్నారావు భార్యే చేసింది.

"రిజర్వేషన్ కూడా లేదన్నారు— పోనీ ఉండి పోండీ పూటకి" అన్నాడు కన్నారావు, ఆ మాత్రమైనా అనకపోతే అత్తగారు ఏడుస్తుందని.

వెళ్ళక తప్పదనీ, వెళ్ళకపోతే ఏమేం మునిగిపోతాయో అన్నీ ఏకరువు పెట్టారు నలుగురూ.

సహజంగానే ఆ నలుగురి దగ్గరా కన్నారావు దంపతులు ఓడిపోయారు. ఆనందదాయకం కావలిసిన ఆ ఓటమి కన్నారావు పట్ల ఒక సవాలై కూర్చుంది.

వాళ్ళ నలుగురికీ రిజర్వేషన్లు— అంటే బెర్తులు కావాలి. కోటా బెర్తులన్నీ వైట్లో కౌంటర్లోనూ, బ్లాకులో సింహాచలం ద్వారానూ ముందుగానే అమ్మకమై పోయాయి. ఆ మాట చెబితే తన అసమర్థత బయట పడుతుంది. ఆ ఇబ్బంది ముఖంలో కనిపించిందో ఏమిటో— "రిజర్వేషన్ లేకపోయినా వెళ్ళిపోతాం. కాశీ నుంచి హాయిగానే వచ్చాం ఈ కాస్త దూరం ఎలా వెళ్ళినా పోయె" అన్నారతని మామగారు.

కన్నారావు సంతోషించి తప్పుకోబోయాడు. కానీ ఆ కాస్త సంతోషాన్ని మిగల్చలేదు ఆయన భార్యామణి.

"అబ్బే...ఎందుకు నాన్నా అవస్థలు పడ్డం? బోలెడు బెర్తులు. ఇలాంటి అవసరాలు వస్తాయనే కొన్ని బెర్తులుంచేస్తారీ రైల్వే వాళ్ళు. రోజూ ఎంతోమందిని ఈయనే పంపిస్తుంటారు. అటువంటిది మీకు లేకపోవడమా?" అంటూ భర్త గొప్పతనాన్ని సాధ్యమైనంత పెద్ద భూతద్దంలోంచి



చూపించింది కన్నారావు భార్య.

కన్నారావు కది సమస్యగానే తోచింది. కానీ అది ఇంత కష్టతరమై పరిష్కారం కాకుండా ఉండిపోతుందని అతను అనుకోలేదు. తన కున్న పలుకుబడినంతా ఉపయోగించినా లాభం లేకపోయింది.

ఒక్క పావు గంట టైముందింకా.

"ఏం బాబూ—ఈ వేళప్పుడిలా వచ్చారూ?"

సింహాచలం మాటలకు ఉలిక్కి పడ్డాడు కన్నారావు. ఆ వెంటనే అతని బుర్రలో ఒక మెరుపు మెరిసింది.

"నీ కోసమే చూస్తున్నానోయ్, అర్జంటుగా నాలుగు బెర్తులు కావాలి మా వాళ్ళకి" అన్నాడు.

"మీకు నా నిప్పించే దేటండీ? ఆస్యమాడ్డానికి నేనే దొరికేనా మీకు!" నవ్వుతూనే అన్నాడు సింహాచలం.

"నిజమే, సింహాచలం. నా పరువు నువ్వే నిలబెట్టాలి. మామగారూ వాళ్ళూ అనుకోకుండా అర్జంటుగా బయలుదేరు తున్నారు" అన్నాడు అన్ని బిగువులూ, హోదాలూ వదిలేసి.

"అదే నిజమైతే వాదాకా ఎందుకు, బాబూ? మీరడిగితే ఎవరు కాదనగల్రు?"

"కాదనరు, అవుననీ అనరు అదే ఇబ్బంది. అసలు మేం చేసే ఉద్యోగాలే అటువంటివి. ఇస్తే మంచి, ఇవ్వక పోతే చెడ్డ అయిపోతాం శాశ్వతంగా!

"సరే బాబూ. మీరు నాకు జెప్పేరు కాబట్టి చూస్తాను. కండక్టరు బాబుని కనుక్కొంటాను. అట్టే టైమ్ కూడా లేదు" అంటూ జనంలో కలిసిపోయాడు సింహాచలం.

'వీడుగాని సాధించుకుని రాకపోతే తన పరువు గంగలో కలిసినట్టే. ఇన్నేళ్ళ రైల్వే సర్వీసూ, సంపాదనా అంతా వృథాయే. వాళ్ళందరి ముందూ చులకనై పోతాడు.'

మామగారిమీద మళ్ళీ కోపమొచ్చింది కన్నారావుకి. ముసలి ముండాకొడుకు ఒక కార్డు రాసి దిగబడితే ఏంపోయిందీ? నాలుగు కాదు నలభై బెర్తులు కైలాసానికే రిజర్వు చేసి ఉంచేసేవాడు.

సరిగ్గా అదే టైమ్‌కి కన్నారావు కళ్ళకి పార్శెల్ క్లర్కు కైలాసరావు కనిపించేడు.

"ఏంటి, గురూగారూ, ఏమిటి సంగతి? మీ రిక్కడున్నారు" అంటూ పలకరించేడు. కాస్మెటిక్స్ దగ్గర్నించి కాలుకుండే జోడువరకూ, బట్టల దగ్గర్నించి బట్టతల కప్పుకునేందుకు వాడే టోపీవరకూ అన్ని వస్తువుల్నీ రైల్వే పార్శెల్ సర్వీస్ ధర్మమా అని సంపాదించుకుంటాడు. తను బయట పడకుండా, అందర్నీ బయట పెడు తుంటాడు.

వీడికి తెలిస్తే పేపర్లో పడ్డట్టే అనుకుని—"ఏం లేదు. మావాళ్ళు వూరెళ్తుంటేనూ పంపించడానికొచ్చా" అంటూ తప్పించుకున్నాడు.

కైలాసరావు అటు కదిలేడో లేదో సింహాచలం ప్రత్యక్షమయ్యేడు. వాడి ముఖంలో ఏ భావమూ వ్యక్తం కాక పోవడం చూసి, "ఏమైంది, సింహాచలం? కాయా, పండా" అన్నాడు ఆదుర్దాగా. అప్పటి కింకా అయిదు నిమిషాలే టైముంది.

"అతి కష్టంమీద ఏర్పాటు చేశాను, బాబూ. మీకంటే తప్పుతుందా" అన్నాడు.

కన్నారావు ముఖం వికసించింది అమాంతంగా సింహాచలం చేతిని తన చేతిలోకి తీసుకుని ఆనందంతో షేక్ చేశాడు.

'కానీ ఒక్కటే, బాబూ పాతికవుతుంది టిక్కెట్టు కాక. "

ఆమాట నెత్తిమీద పిడుగులా అన్పించింది కన్నారావుకి. కన్నాళ్ళూ తనదే లాభసాటి వ్యాపార మనుకున్నాడు. అవసరం మనిషిని ఎంతటి స్థితికైనా దిగజారుస్తుంది గనుక ఎదుటి మనిషి అవసరాన్ని స్వార్థాని కుపయోగించుకోడం లోనే ఉంది మజా అంతా అనుకున్నాడు. కానీ తనే చిక్కుకున్నా డిప్పుడు.

"తప్పదా" అన్నట్టు చూశాడు సింహాచలం వంక.

ఆ చూపు సింహాచలానికేం కొత్త కాదు.

నిత్యం ఎన్నో చూపు లటువంటివి అతనికి తారసపడుతూనే ఉంటాయి.

"మరో దారి లేదు, బాబూ. అసలే పెళ్ళిళ్ళ సీజనూ. మీ ఇష్టం మరి" అన్నాడు ధీమాగా.

బండి కూత వేసింది.

"సరే కానీయ్" అని ఇబ్బందిగా పర్సు తీసి డబ్బు లెక్కపెట్టి సింహాచలం చేతి కిచ్చాడు కన్నారావు.

ఆ డబ్బును తిరిగి సంపాదించే శక్తి లేనివాడు కాదు తను.

కానీ తనిచ్చిన డబ్బులోని రెండు పదులు సింహాచలం జేబులోకి కమిషన్ రూపంలో వెళ్ళడం చూసి షాక్ తిన్నాడు కన్నారావు.

కన్నారావులాంటి వాళ్ళు నిత్యం నీరు పోసి పెంచుతున్న అవినీతి చెట్టునీడన కాపలా ముంటున్న సింహాచలాలు ఎంతమందో!

వూడలు దింపి విస్తరించే ఆ మహా వృక్షపు ఎదుగుదలను ఆపగలిగే వారెవరు?

ప్లాట్‌ఫాం మీద పచ్చ జెండా ఎగురుతోంది!

★


# ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్య వ్యవహారాలకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం మీకు చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తికొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలా లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ విడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తిహక్కులు ఎవరితోనైనా ప్రమాదం రాబోతుంటే, పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ప్రభుత్వ ఉచిత యిండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తువ్రాసి పంపుకోవాలి, నోట్లు దస్తావేజులు, ఒప్పందాల పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు, ఇలాంటివెన్నో మీకుపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ॥12. పోష్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకు సమీపాన, హైదరాబాదు-890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టు ద్వారా వీలయినంత త్వరగా పొందండి